సాక్షి అనకాపల్లి

7

శుక్రవారం । 3 । జనవరి । 2025



విశాఖ జ్యోతి.. జాతీయ కీర్తి

ఆమె పరుగు చిరుత వేగాన్ని తలపిస్తుంది. ట్రాక్‌లో దిగిందంటే ట్రెండ్ సెట్ చేయాల్సిందే. ఇది ఆమె ట్రాక్ రికార్డు చూస్తేనే తెలుస్తుంది. ఎటువంటి క్రీడా నేపథ్యం లేని కుటుంబం నుంచి వచ్చి.. ఓ వైపు గాయాలు వెంటాడినా.. కరోనా సమయంలో పరుగుకు దూరమైనా నిరాశ చెందలేదు. పరుగును ఆపలేదు. అవరోధాల(హర్డిల్స్)ను అధిగమిస్తూ రికార్డుల మీద రికార్డులు సృష్టించింది. దేశంలోనే అత్యంత వేగవంతమైన మహిళా హర్డిలర్‌గా చరిత్ర లిఖించింది. ఒలింపిక్స్ క్రీడాకారులందరికీ ఒక కల. ఆ కలను నిజం చేస్తూ దేశంలోనే తొలి మహిళా హర్డిలర్‌గా ఖ్యాతినార్జించింది. రెప్పపాటులో పతకం చేజారిపోయే అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించడం ఒక ఎత్తు అయితే.. క్రీడాకారులకు అందించే అత్యున్నత అవార్డు 'అర్జున'పొందడం గొప్ప విషయం. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ ఈ నెల 17న రాష్ట్రపతి చేతుల మీదుగా అర్జున అవార్డు అందకోనుంది మన విశాఖ అమ్మాయి, అథ్లెట్ జ్యోతి యర్రాజీ.

- విశాఖ స్పోర్ట్స్

8లో

న్యూస్‌రీల్

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు కార్యాచరణ

- అనకాపల్లి జిల్లాకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.80 కోట్లు
- అధికారులతో సమీక్షలో జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

సబ్బవరం: రానున్న వేసవిలో అనకాపల్లి జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.80 కోట్లు మంజూరు చేసిందని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. మండలంలోని సబ్బవరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్థానిక అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జల్ జీవన్ మిషన్ పనులు, రక్షిత మంచినీటి పథకాలు, తాగునీటి బోర్ల పనితీరు, చేపడుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గత రెండేళ్లలో మండలంలో చేపట్టిన పనులపై సమీక్షించారు. పంచాయతీల్లో తాగునీటి సరఫరాపై ఆరా తీయడంతో పాటు అధికారులకు పలు సూచనలు చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ఇప్పటికే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని, ఆ మేరకు పనులు చేపడుతున్నట్లు అధికారులు ఆయనకు తెలిపారు. కార్యక్రమంలో ఏవో శివరామ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జి.శివకృష్ణ, ఏఈ శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ హరిణి తదితరులు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం కేకే లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో జగదల్‌పూర్ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- ఈ నెల 6న విశాఖపట్నం-కిరండూల్(58501) పాసింజర్ జగదల్‌పూర్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 7వ తేదీన కిరండూల్-విశాఖపట్నం (58502) పాసింజర్ జగదల్‌పూర్ నుంచి బయల్దేరుతుంది.
- ఈ నెల 5వ తేదీన విశాఖపట్నం-కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ వరకు మాత్రమే నడుస్తుంది, తిరుగు ప్రయాణంలో ఈ నెల 6వ తేదీన కిరండూల్- విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ నుంచి బయల్దేరుతుంది.

డీఎంహెచ్‌వో డా.రవికుమార్ బాధ్యతల స్వీకారం



సాక్షి, అనకాపల్లి : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి(డీఎంహెచ్‌వో)గా డాక్టర్ పి.రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరం ఏరియా ఆసుపత్రిలో ఆర్‌ఎంవోగా పనిచేశారు. పదోన్నతిలో భాగంగా అనకాపల్లి డీఎంహెచ్‌వోగా బదిలీపై వచ్చిన విషయం తెలిసిందే. ఇక్కడ గతంలో డీఎంహెచ్‌వోగా పనిచేసిన డాక్టర్ హేమంత్ రిటైర్ అవ్వడంతో అడిషనల్ డీఎంహెచ్‌వోగా ఉన్న డాక్టర్ బాలాజీను ఇన్‌ఛార్జిగా అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. ఈ సందర్భంగా కొత్త డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవికుమార్‌కు అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీతో పాటు జిల్లాలో మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

శభాష్ సాయికుమార్

- దివ్యాంగుల కోటాలో ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు ఎంపిక



బుచ్చెయ్యపేట : మండలంలో రాజాం గ్రామానికి చెందిన మరిశా సాయికుమార్ నాలుగు ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించుకున్నారు. సాయికుమార్ బీటెక్ పూర్తి చేశారు. బ్యాంకు ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతుండగా, రెండు మాసాలకు ముందు తమిళనాడులో ఐడీబీఐ బ్యాంకు క్లర్క్‌గా ఎంపికయ్యారు. ఈ జాబ్ చేస్తుండగా మరికొన్ని ఉద్యోగాలకు పోటీ పరీక్షలు రాశారు. దీంతో ఎస్‌బీఐ క్లర్క్ పోస్టు వచ్చింది. ఈ పోస్టులో జాయిన్ అయిన వారం రోజుల్లో మరో రెండు నోటిఫికేషన్ల ఫలితాలు వచ్చాయి. దీనిలో తెలంగణ రూరల్ బ్యాంకు పీవో, తెలంగాణ రూరల్ బ్యాంకు క్లర్క్ పోస్టులు వచ్చాయి. వీటిలో ఎస్‌బీఐ బ్యాంకు క్లర్క్ పోస్టును ఎంచుకున్నారు. సాయికుమార్‌కు తల్లిదండ్రులు వెంకటరమణ, నాగమణి, బంధు మిత్రులు, రాజాం యూత్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

మంచు మురిసే వేళలో...

చలిపులి తోవలో కాచుకుని ఉన్నట్టుగా..పొగమంచు కమ్ముకుంది. శీతకాలం కోతపెడుతోంది. వేయి చేతులు కదలించి విశ్వజగతికి జీవకాంతులు ప్రసరింపజేయుమోయి..తెరలు తొలగించి రావోయి అరుణమూర్తి..అని వేడుకుంటూ జనం నిదానంగా దినచర్యలు ప్రారంభిస్తున్నారు. గ్రామసీమలు, పంట పొలాలు మంచుతెరలతో ప్రకృతి ప్రియులను పరవశులను చేస్తున్నాయి. పల్లెజనం చలినెగళ్లతో సావాసం చేస్తున్నారు. పగలు 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉన్నా..రాత్రుళ్లు 13 డిగ్రీలకు పడిపోయి వణికిస్తోంది. పొగమంచుతో దారులన్నీ నిర్మానుష్యమవుతున్నాయి. పాడేరు ఏజెన్సీకి ముఖద్వారంగా ఉన్న మైదాన ప్రాంతమైన చోడవరంలో గురువారం ఉదయం కనిపించిన శీతల దృశ్యాలివి. ఉదయం 8 గంటలకు నిదానంగా పలకరిస్తున్న భానుడు...సాయంకాలం 4 గంటలకే చల్లగా మంచుతెరల చాటుకు జారుకుంటున్నాడు.

- చోడవరం





తీపి పంటకు చేదు రోజులు

'ఎస్.రాయవరం మండల కేంద్రంలో ఉన్న చెరకు తూనిక కేంద్రం సుమారుగా 80 సెంట్లు స్థలంలో ఉంది. దీన్ని లీజు పద్ధతిలో తీసుకున్నారు. లీజు గడువు ముగియక ముందే వదులుకోవాల్సినపరిస్థితి ఏర్పడింది. తూనిక కేంద్రం షెడ్డులో మందుబాబులు మందు తాగడానికి ఉపయోగించుకుంటున్నారు. షుగర్స్ తూనిక కేంద్రం షెడ్డులోనే మందుబాబులు మందు తాగుతున్నారు. మొత్తం మీద తూనిక కేంద్రం బారులా వాడుకుంటున్నారు.' ఇది ఏమిటని ఎవరైనా అడిగితే ఇది ప్రైవేట్ స్థలం లీజు పద్ధతిలో తూనిక కేంద్రంగా ఇచ్చారు. లీజు గడువు అయిపోయింది. అందుకే తాము కొనుక్కున్నామని అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ తూనిక కేంద్రాలు స్థలంతో పాటు..ఆ షెడ్లు ఇలా బారులు తీరుతున్నాయి"

- బోసిపోయిన చెరకు తూనిక కేంద్రాలు
- కొన్ని చోట్ల మద్యం బార్ సెంటర్‌లుగా నిర్వహణ
- జిల్లాలో 52 కాటా సెంటర్లు
- 2014లో చంద్రబాబు హయాంలో మూత పడిన మూడు సహకార షుగర్ ఫ్యాక్టరీలు
- గిట్టుబాటు లేకపోవడంతో చెరకు వైపు ఆసక్తి చూపని రైతులు
- జిల్లాలో తగ్గిన 2 లక్షల టన్నుల చెరకు
- గతంలో ఒక్కో సెంటర్ నుంచి సగటున 4 వేల టన్నుల చెరకు తూనికలు
- ప్రస్తుతం మూతపడిన కేంద్రాలు



సాక్షి, అనకాపల్లి :

జిల్లాలో మూత పడిన ఏటికొప్పాక, తాండవ, తమ్మపాల సహకార షుగర్ ఫ్యాక్టరీలు పరిధిలో ఉన్న కొన్ని తూనిక కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు ఉపయోగపడుతున్నాయి. మరికొన్ని చెట్లు, తుప్పలు పేరుకుపోయి బోసిపోయి ఉన్నాయి. జిల్లాలో ఈ మూడు షుగర్స్ పరిధిలో సుమారుగా 52 కాటా సెంటర్లు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా 2 లక్షల టన్నుల చెరకు షుగర్ ఫ్యాక్టరీలకు పంపించేవారు. సగటున ఒక్కో కాటా సెంటర్ నుంచి 5 వేల నుంచి 10 వేల టన్నుల చెరకు తూనికలు జరిగేవి. రైతులతో కళకళలాడేది. 2014-19 నాటి చంద్రబాబు సర్కార్ నిర్వాకం కారణంగా జిల్లాలో రాష్ట్రంలోనే అతిపెద్ద షుగర్ ఫ్యాక్టరీ అయిన ఏటికొప్పాక, తాండవ, తుమ్మపాల ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. అప్పటి చంద్రబాబు సర్కార్ చెరకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం, షుగర్ ఫ్యాక్టరీల బకాయిలు చెల్లించకపోవడంతో చెరకు రైతు రోడ్డు పడ్డాడు. చెరకు సాగు చేసే రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు కల్పించకపోవడంతో చెరకు సాగు చేయాలంటే భయపడుతున్నారు. పెరిగిన పెట్టుబడులు చూసి రైతులు సాగు చేయడం పూర్తిగా మానుకున్నారు.

రోడ్డున పడ్డ రైతులు, 15 వేల కార్మికులు..

చెరకు ఎక్కువగా పడించే జిల్లాల్లో అనకాపల్లి జిల్లా పెట్టింది పేరు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువ సామర్థ్యం ఉన్న షుగర్ ఫ్యాక్టరీల్లో ఏటికొప్పాక అత్యంత పురాతన, ఎక్కువ సామర్థ్యం కలది. ఆ తరువాత గోవాడ, తాండవ, తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీలుంటాయి. వీటిలో గోవాడ షుగర్స్ తప్ప మరే ఫ్యాక్టరీలు క్రషింగ్‌ల్లో లేవు. దీంతో జిల్లాలో సుమారుగా 2 లక్షల టన్నుల చెరకు తగ్గింది. దాదాపుగా 15 వేల మంది కార్మికులు, ఉద్యోగులు, సుమారుగా ఒక లక్ష మంది రైతులు రోడ్డున పడ్డారు. అనకాపల్లి జిల్లాలో పరిధిలో అనకాపల్లి రూరల్, కశింకోట, మునగపాక, సబ్బవరం, చోడవరం మండల పరిధిలో 7 వేల మంది రైతులు చెరకు సాగు చేసి బెల్లం తయారీ చేస్తారు. మిగతా రైతులంతా ప్రత్యామ్నాయ పంటలైన వరి, అపరాలు, సరుగుడు వంటి పంటలు వేసుకున్నారు.



గొలుగొండలో తుప్పలు, చెట్లతో నిండి ఉన్న చెరకు తూనిక కేంద్రం(కాటా షెడ్డు)



మద్యం దుకాణందారులు బారులా ఉపయోగించుకుంటున్న ఎస్.రాయవరం చెరకు తూనిక కేంద్రం (కాటా షెడ్డు)

పెరిగిన పెట్టుబడులు

చెరకు రైతులకు ఈ ఏడాది టన్నుకు రూ.2,900 ధర కల్పించారు. అయితే పెరిగిన కూలి రేట్లు, పెట్టుబడులు పెరగడంతో గిట్టుబాటు ధర లేక రైతులు చెరకు సాగు చేయడం తగ్గించారు. ఒకప్పుడు చెరకు పంట వేసుకుంటే సంక్రాంతి సమయంలో ఎంతో ఆసక్తిగా చేసేవాళ్లం. 2014-19 మధ్య కాలంలో చెరకు సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పేమెంట్లు సక్రమంగా ఇవ్వకపోవడంతో అప్పులు పాలైపోయాం

– ఎ.చిట్టిబాబు, రైతు

గిట్టుబాటు ధర లేదు..



చెరకు సాగుతో నష్టమే తప్ప లాభాలు లేవు. దీంతో రైతు రానురాను సాగు చేయడం మానుకుంటున్నాడు. 2014లో చెరకు రైతుకు అడుగడుగునా చంద్రబాబు అన్యాయమే చేశారు. అప్పుడు షుగర్ ఫ్యాక్టరీలు మూతపడడం, గిట్టుబాటు ధర కల్పించకపోవడం జరిగింది. ఇపుడైనా కూటమి ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీలు తెరచి, చెరకు రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తే మళ్లీ చెరకు సాగువైపు రైతులు ఆసక్తి చూపుతారు. మాకు ఏటికొప్పాక చక్కెర కర్మాగారం మూతపడడంతో గోవాడకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. టన్నుకు రూ.4వేల వరకు గిట్టుబాటు ధర కల్పిస్తే బాగేండేది. కానీ టన్నుకు రూ.2900 ఇవ్వడం వల్ల కనీసం పెట్టుబడులు మాట పక్కన పెడితే నష్టాలు వస్తున్నాయి. మద్దతు ధర లేకపోవడంతో చెరకు రైతులు పరిస్థితి దయనీయంగా మారింది.

– నారాయణమూర్తి, రైతు, గొలుగొండ

జోన్‌కు మరో'సారీ'!

- 8వ తేదీన ప్రధాని మోదీ విశాఖ రాక
- 6వ తేదీన రాయగడ డివిజన్‌కు శంకుస్థాపన
- దక్షిణ కోస్తా రైల్వే జోన్ శంకుస్థాపన లేదని చెబుతున్న అధికారులు
- ఇప్పటికే పలుమార్లు వాయిదా వేసిన ప్రభుత్వం

దశాబ్దాల కలగా మిగిలిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ అంశంలో కూటమి ప్రభుత్వం మరోసారి రిక్తహస్తాలు చూపిస్తోంది. ఈ నెల 8న విశాఖలో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో జోన్ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. రాయగడ డివిజన్‌కు పీఎం చేతుల మీదుగా శంకుస్థాపనకు చకచకా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు.. దక్షిణ కోస్తా రైల్వే జోన్ శంకుస్థాపన మాత్రం ఉండబోదని స్పష్టం చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కూటమి నేతలు పట్టుబట్టడంతోనే 'జోన్'కు గ్రహణం పట్టినట్లు తెలుస్తోంది.

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు 2019లో కేంద్రం పచ్చజెండా ఊపింది. జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌ని అదే ఏడాది చివరిలో ఇచ్చారు. కానీ ఇంతవరకు కార్యరూపం దాల్చకుండా కేవలం రాజకీయ కక్షతోనే జోన్‌ను ఆపేశారు. 2022లో జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి డీఆర్‌ఎం కార్యాలయం ఎదురుగా ఉన్న వైర్‌లెస్ కాలనీని ఎంపిక చేశారు. అక్కడ ఉన్న 13 ఎకరాల్లోని 8 ఎకరాల విస్తీర్ణంలో హెడ్‌క్వార్టర్స్‌కు సంబంధించి డిజైన్లకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదముద్ర వేశారు. కాలనీని సైతం పరిశీలించారు. 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని శిలాఫలకం కూడా సిద్ధం చేసి చివరి నిమిషంలో రాజకీయ కుట్రతో నిలిపేశారు.

వాయిదాల పర్వమే..

గత నవంబర్ 29న విశాఖలో ప్రధాని పర్యటనకు సర్వం సిద్ధమైంది. పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ప్రధాని చేతుల మీదుగా చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా.. అందులో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ శంకుస్థాపన కార్యక్రమం కూడా ఉంది. అయితే.. కూటమి నేతలు జోన్ శంకుస్థాపనను వాయిదా వేయాలని పట్టుబట్టడంతో చివరి నిమిషంలో ఆపేశారు. ఆ తర్వాత ప్రధాని పర్యటన కూడా వాయిదా పడింది. ఈ నెల 8న విశాఖ జిల్లాలో ప్రధాని పర్యటించనున్నట్లు అధికారులు ధృవీకరించారు. ఆంధ్ర యూనివర్సిటీలో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో ప్రధాని పాల్గొని కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. దీనికి సంబంధించి రైల్వే బోర్డు.. వివిధ రైల్వే డివిజన్ల నుంచి ప్రాజెక్టుల వివరాలు పంపించాలని ఆదేశాలు జారీ చేసింది. వాల్తేరు డివిజన్‌కు మాత్రం ఎలాంటి ఆదేశాలు అందలేదు. అయితే ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజన్ మాత్రం రాయగడ డివిజన్ శంకుస్థాపన గురించి ప్రతిపాదనలు పంపించి, విశాఖ జోన్ గురించి అందులో పొందుపరచలేదు.



రైల్వే జోన్‌కు ముడసర్లోవలో కేటాయించిన స్థలం (ఇన్‌సెట్) విశాఖలో డీఆర్‌ఎం ఆఫీసు

దీంతో ఈసారి కూడా ప్రధాని పర్యటనలో రైల్వే జోన్ శంకుస్థాపన ఉండబోదని రైల్వే అధికారులు స్పష్టం చేస్తున్నారు.

జోన్‌తో పాటు రాయగడ డివిజన్ కానీ..

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌తోపాటే వాల్తేరు డివిజన్‌లో కొంత భాగం, ఈస్ట్‌కోస్ట్‌లోని మరికొంత భాగం కలిపి రాయగడ డివిజన్‌ని ప్రకటించారు. రైల్వే జోన్ కోసం ఇప్పటివరకు రూ.106 కోట్లు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ప్రకటించగా.. రాయగడ డివిజన్‌కు మాత్రం రూ.70 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే స్టేషన్ పక్కనే రాయగడ డివిజన్ కార్యాలయ నిర్మాణానికి టెండర్లు ఖరారు చేసినట్లు సమాచారం. ఇప్పుడు విశాఖలో ఈ డివిజన్ శంకుస్థాపన నిర్వహించి.. జోన్‌ని పక్కన పెడితే వ్యతిరేకత వస్తుందనే కారణంతో.. 6వ తేదీన వర్చువల్‌గా పీఎం చేతుల మీదుగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే జోన్ కోసం మరికొద్ది నెలలు ఆగాల్సిందేనని రైల్వే అధికారులు చెబుతున్నారు.

తాత్కాలిక సేవలు కూడా లేనట్లే.!

జోన్ ప్రకటన వచ్చి ఐదేళ్లు గడిచిన తర్వాత.. తాజాగా టెండర్లకు ఆహ్వానించారు. అయితే.. కొత్త భవన నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రెండేళ్లకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. ఈలోగా జోన్ కార్యకలాపాలు కూడా ప్రారంభించాలనే ఆదేశాలు కూడా ఇవ్వాలా వద్దా అనే ఆలోచనలో రైల్వే బోర్డు ఉంది. ఒకవేళ బిల్డింగ్ నిర్మాణంతో పనిలేకుండా.. జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. తాత్కాలిక కార్యాలయంగా ప్రస్తుతం ఉన్న వాల్తేరు డీఆర్‌ఎం కార్యాలయాన్ని వినియోగిస్తారని అనుకున్నారు. కానీ.. కొత్త కార్యాలయం పూర్తయితేనే.. జోన్ కార్యకలాపాలు నిర్వహిస్తామని రైల్వే ఉన్నతాధికారులు సంకేతాలిచ్చినట్లు వాల్తేరు వర్గాలు చెబుతున్నాయి. అయితే జోన్‌ని కూటమి నేతలు ఎన్నికల అంశంగానే చూస్తున్నారే తప్ప.. సెంటిమెంట్‌గా చూడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రధాని పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లను పక్కాగా చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 8న ప్రధానమంత్రి నరేంద్రమోదీ అచ్యుతాపురం, నక్కపల్లిలో శంకుస్థాపన కార్యక్రమాలను విశాఖపట్నంలో నిర్వహించే బహిరంగసభ నుండి వర్చువల్‌గా నిర్వహిస్తారని, ఇక్కడి ప్రజలతో ముఖాముఖి సంభాషిస్తారని ఆమె తెలిపారు. ప్రధాని పర్యటన కార్యక్రమం విజయవంతం చేయుటకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అచ్యుతాపురంలో అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ ఆయిషా, నక్కపల్లిలో నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి వి.వి.రమణలకు వర్చువల్ ఏర్పాట్లు బాధ్యతలు అప్పగించారు. బస్సులు, భోజన ఏర్పాట్ల బాధ్యతలను జిల్లా రవాణా అధికారి, సివిల్ సప్లయి అధికారి, జిల్లా పంచాయతీ అధికారులకు అప్పగించారు. సమన్వయంతో ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. మొత్తం కార్యక్రమం సమన్వయం చేసుకోవడానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

సదరం సర్టిఫికెట్ల తనిఖీకి బృందాలు

- ఇంటింటికీ తిరిగి పింఛన్లపై తనిఖీలు
- నకిలీ ధ్రువీకరణ పత్రాల గుర్తింపునకు చర్యలు

తుమ్మపాల : జిల్లాలో సదరం సర్టిఫికెట్స్ తనిఖీకి షెడ్యూలు రూపొందించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, సెర్ప్ సీఈవో వీరపాండ్యన్ అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ విజయ కృష్ణన్ హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతున్న వారి ధ్రువీకరణ పత్రాలను మొదటి దశలో పరిశీలించడం జరుగుతుందని, సదరం సర్టిఫికెట్ల ద్వారా అనేక మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నట్టుగా ఆరోపణలు నేపథ్యంలో తనిఖీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా పింఛన్లు పొందే వారిని తొలగించే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందన్నారు. అందులో భాగంగా పరిశీలన చేపడుతున్నామన్నారు. ఇందుకోసం వైద్య బృందాలను నియమిస్తామన్నారు. సదరం ద్వారా జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను నిశితంగా పరిశీలించాలన్నారు. పరిశీలన కొరకు ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో వివరాలను నిక్షిప్తం చేయాలన్నారు. విషయాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు, ట్యాంపరింగ్ వంటి వాటిపై సమగ్ర నివేదిక ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేకంగా నియమించిన వైద్య బృందాలకు సహాయ సహకారాలు అందించడానికి సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలన్నారు. వారి ద్వారా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి విచారించాలన్నారు. అనర్హులుంటే వారి వివరాలను సంబంధిత వైద్యాధికారులు తక్షణమే యాప్‌లో నమోదు చేయాలన్నారు. వైద్యుల ధ్రువీకరణతో ఇచ్చిన సర్టిఫికెట్లు సైతం రద్దు అవుతాయన్నారు. నూరు శాతం నిక్కచ్చిగా పరిశీలన, విచారణ ప్రక్రియ జరుగుతుందన్నారు. బృందాలను పర్యవేక్షించుకోవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వైద్య బృందాల పరిశీలన కొరకు సూక్ష్మ ప్రణాళిక, రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె. శచీదేవి, జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషారాణి, జిల్లా వైద్య ఆరోగ్యఅధికారి డాక్టర్ పి. రవికుమార్, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి ఎస్. మంజులవాణి , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారులకు బాక్సింగ్‌లో తర్ఫీదు



బాక్సింగ్‌లో తర్ఫీదు పొందుతున్న చిన్నారులు

నర్సీపట్నం : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఎన్ఐఎస్ కోచ్‌గా సర్టిఫికెట్ సాధించిన బాక్సింగ్ క్రీడాకారిణి వేపాడ ప్రియాంక చిన్నారులకు బాక్సింగ్‌లో తర్ఫీదు ఇస్తున్నారు. మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి ఆర్‌సీఎం స్కూల్ గ్రౌండ్‌లో వుషూ, బాక్సింగ్, కరాటే, యోగాలో శిక్షణ ఇస్తున్నారు. నర్సీపట్నం రాలేని చిన్నారులు ఆర్‌సీఎం గ్రౌండ్‌లో తర్ఫీదు పొందవచ్చనని ప్రియాంక పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికలు, అమ్మాయిలకు సెల్ఫ్ ప్రొటెక్షన్ టెక్నిక్‌లలో ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంటర్ వర్సిటీ పోటీలకు డైట్ విద్యార్థిని



సింధు

అనకాపల్లి : చెన్నై ఏఎంఈటీ యూనివర్సిటీలో ఈనెల 3, 4, 5 తేదీల్లో జరగనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ టేబుల్ టెన్నిస్ పోటీలకు డైట్ కళాశాలలో మూడో సంవత్సరం సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని కె.సింధు అర్హత సాధించినట్లు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

వాసవీ జాగృతి జిల్లా వైస్ గవర్నర్‌గా 'శ్రీనాథు'



మాడుగుల : వాసవీ జాగృతి ఇంటర్ నేషనల్ జిల్లా వైస్ గవర్నర్‌గా శ్రీనాథు శ్రీనివాసరావును ఎంపిక చేశారు. మాడుగుల ఉపసర్పంచ్‌గా, జూనియర్ కళాశాల చైర్మన్‌గా , మోదకొండమ్మ ఆలయ కమిటీ సభ్యుడుగా, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడుగా, రైల్వే బోర్డు మెంబరుగా, దేవీ ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఉత్తమ సేవలందించారు. ప్రస్తుతం ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షునిగా సేవలందిస్తున్నారు. ఈ సేవలను గుర్తించిన వాసవీ జాగృతి ఇంటర్‌నేషనల్ సంఘ వ్యవస్థాపకుడు తిరువీది వేణుగోపాల్ అనకాపల్లిలో జరిగిన సంఘ సమావేశంలో శ్రీనివాసరావును జిల్లా వైస్ గవర్నర్‌గా ఎంపిక చేశారు. మాడుగుల క్లబ్ అధ్యక్షుడిగా పుట్టా వాసు, కార్యదర్శిగా పాలకుర్తి పద్మను నియమించారు. వారిని సర్పంచ్ ఎడ్ల కళావతి మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, మోదకొండమ్మ ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజుతో పాటు ఎంపీటీసీలు అభినందించారు.

వీఎంఆర్‌డీఏలో ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం

విశాఖ సిటీ: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వీఎంఆర్‌డీఏలో ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటలకు టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. టౌన్ ప్లానింగ్ సేవలను వేగవంతం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. దీని ద్వారా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులు, ఇతరత్రా అభ్యర్థులను స్వీకరిస్తామని వెల్లడించారు. వీటిని పరిశీలించి ప్రాధాన్యత ప్రాతిపదికను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతి శుక్రవారం వీఎంఆర్‌డీఏ మూడో ఫ్లోర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఆధ్వర్యంలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విశాఖ జ్యోతి.. జాతీయ కీర్తి



అడ్డంకులు దాటి.. అర్జున అవార్డుకు ఎంపికైన జ్యోతి యర్రాజీ

పాఠశాల నుంచి ఒలింపిక్స్ స్థాయికి ఎదిగిన స్ఫూర్తిదాయక ప్రస్థానం

జిల్లా అథ్లెటిక్ సంఘం, జిల్లా ఒలింపిక్ సంఘం హర్షం

విశాఖ స్పోర్ట్స్ :

ఆర్థికంగా స్థిరమైన స్థితిలో లేకపోయినా.. జ్యోతి చిన్నప్పటి నుంచే ఆటల పట్ల ఆసక్తి పెంచుకుంది. జాతీయ స్థాయిలో రాణించాలని కలలుకంది. ఆమె తండ్రి సూర్యనారాయణ సెక్యూరిటీ గార్డుగా, తల్లి ఇళ్లలో సహాయక పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. జ్యోతి పోర్టు ఉన్నత పాఠశాలలో చదువుతున్న సమయంలో ఆటల పట్ల ఆసక్తి కనబరిచింది. పాఠశాలలో ప్రత్యేక శిక్షణ శిబిరాలు ప్రారంభించడంతో స్కూల్ గేమ్స్‌లోనే పతకం సాధించింది. తొలుత స్ప్రింట్‌లోని మూడు విభాగాల్లో పాల్గొనేది. ఆ తర్వాత రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ శిక్షణ శిబిరంలో పాల్గొనడంతో జాతీయ స్థాయిలో పోటీపడింది. 2019లో గుంటూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరింది. అప్పటి వరకు జాతీయ స్థాయిలో పోటీ పడుతున్నా ఆశించిన ఫలితాలు రాలేదు. ఆ సమయంలో రిలయన్స్ పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో అథ్లెటిక్స్‌కు శిక్షణ ప్రారంభమవుతుందని తెలియడంతో దరఖాస్తు చేసుకుంది. అప్పటికే జాతీయ స్థాయిలో పతకం ఉండటంతో శిబిరంలో స్థానం సంపాదించింది. అక్కడి నుంచి వెనుదిరిగి చూడలేదు. ఒక్కో మెట్టు ఎక్కుతూ.. జాతీయ రికార్డులు నెలకొల్పడం, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించడంతో జాతీయ మహిళా ఫాస్టెస్ట్ హర్డిలర్‌గా నిలిచింది. ఒకే ఏడాదిలో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ ప్రపంచ ర్యాంకింగ్‌లో 24వ స్థానానికి చేరుకుని.. ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. తొలిసారి ప్రపంచ మేటి వుమెన్ హర్డిలర్స్ పోటీని ఆస్వాదించింది. ప్రస్తుతం ముంబయిలో శిక్షణ శిబిరంలో ఉన్నాని, అర్జున అవార్డుకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని జ్యోతి 'సాక్షి'తో చెప్పింది.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం, ఒలింపిక్స్‌లో పాల్గొనడం జ్యోతికి కీర్తిని తెచ్చిపెట్టిందని జిల్లా అథ్లెటిక్ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. భారత ప్రభుత్వం నుంచి అర్జున అవార్డు పొందడం గర్వించదగ్గ విషయమని జిల్లా ఒలింపిక్ సంఘం మరో ప్రకటనలో అభినందనలు తెలిపింది.

ఆనందానికి అవధుల్లేవు

ఆర్థికంగా వెసులుబాటు లేకపోయినా.. ఆటల్లో పాల్గొనేందుకు జ్యోతిని ప్రోత్సహించాం. శాప్‌లో ప్రత్యేక శిక్షణకు అర్హత సాధించినప్పుడే తొలిసారిగా విశాఖను విడిచి వెళ్లింది. అప్పటి నుంచి ఒడిదుడుకులు ఎదుర్కొంటూనే అనుకున్న లక్ష్యానికి చేరుకుంది. అర్జున అవార్డు వచ్చిందని జ్యోతి చెబుతుంటే మా ఆనందానికి అవధులు లేవు. ఇంటికి సైతం రాకుండా అకాడమీలో శిక్షణ తీసుకుంటోంది.

– సూర్యనారాయణ, జ్యోతి తండ్రి

రికార్డులను తిరగరాసింది

అథ్లెటిక్స్‌లో అర్జున అవార్డు పొందడం పూర్తిగా వ్యక్తిగత ప్రతిభతోనే సాధ్యమవుతుంది. అథ్లెటిక్స్‌లో టైమింగ్ చాలా కీలకం. క్షణంలో ఫలితం తారుమారవుతుంది. అలాంటి ట్రాక్ ఈవెంట్‌లో అంతర్జాతీయ పతకాలు సాధించాలంటే ఎంతో కఠోర శ్రమ ఉండాలి. రికార్డును నిలబెట్టుకోవడం సులభం కాదు. అలాంటి రికార్డును జ్యోతి తిరగరాసింది.

– ఐ.వెంకటేశ్వరరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత

మరిన్ని విజయాలు సాధించాలి

పాఠశాల, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనడం మొదలుకొని ప్రతి రోజూ పోర్ట్ స్టేడియంలో కలిసి శిక్షణకు వెళ్లేవాళ్లం. సాయంత్రం వేళల్లో వ్యాయమాలు చేస్తూ.. తోటి క్రీడాకారిణులతో కలిసి ప్రతీ వారం పోటీలు జరిగేవి. జ్యోతితో పోటీపడేవాళ్లం. జ్యోతి శాప్ శిక్షణకు ఎంపికైంది. అలా జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తూ నేడు అర్జున అవార్డుకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఆమె మరిన్ని విజయాలు సాధించాలి.

– పూజిత, పాఠశాలలో తోటి క్రీడాకారిణి

పీసా కమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- నేడు, రేపు నాతావరం మండలంలో 10 గ్రామాల్లో నిర్వహణ
- ముందు ఉపాధ్యక్షుడు, తర్వాత కార్యదర్శి ఎన్నిక
- కమిటీ అధ్యక్షుడిగా సర్పంచ్‌కు బాధ్యతలు
- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగ శిరీష



శృంగవరంలో పింఛన్ లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్న జిల్లా గిరిజన శాఖ అధికారి నాగశిరీష

నాతవరం: పాడేరు ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్డ్ యాక్ట్(పీసా) కమిటీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి నాగ శిరీష తెలిపారు. మండలంలో గురువారం శృంగవరం, నాతవరం పంచాయతీల్లో పింఛన్ల లబ్ధిదారులను క్షేత్ర స్థాయిలో తహసీల్దార్ ఎ.వేణుగోపాల్‌తో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో 1/70 యాక్టు ఉన్న 5వ షెడ్యూల్డు గిరిజన గ్రామాల్లో శుక్ర, శనివారాల్లో పీసా కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నామన్నారు. జిల్లాలో 1/70 యాక్టు పరిధిలో నాతవరం మండలంలో ఉన్న 10 గ్రామాల్లో ఈ ఎన్నికలు జరుగుతాయన్నారు. కమిటీ ఉపాధ్యక్షుడు, కార్యదర్శి పదవులకు గిరిజనులే పోటీ చేయాలన్నారు. ఎన్నికలు జరిగే గ్రామంలో ముందుగా నిర్వహించే గ్రామసభలో 1/3 వంతు గిరిజనుల హాజరు ఉండాలన్నారు. ముందుగా ఉపాధ్యక్షుడిని, తర్వాత కార్యదర్శిని చేతులెత్తే విధానంలో ఎన్నుకోవాలన్నారు. నామినేషన్ స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, ఎన్నికలు ప్రక్రియ అంతా ఒకే రోజు ఉంటుందన్నారు. పీసా కమిటీ అధ్యక్షుడిగా ప్రస్తుతం ఉన్న గ్రామ సర్పంచ్ కొనసాగుతారని చెప్పారు. ఈ కమిటీ ఐదేళ్ల పాటు పదవిలో ఉంటుందన్నారు. ఏదైన కారణం చేత ఎన్నికలు వాయిదా వేసే అధికారం పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారికి మాత్రమే ఉందన్నారు. పీసా కమిటీ ఎన్నికలు జరిగే గిరిజన గ్రామాల్లో ఎన్నికల అధికారులను నియమించారు.

శుక్రవారం ఎన్నికలు జరిగే గ్రామాలు	
గ్రామం	ఎన్నికల అధికారి
పొట్టినాగన్నదొరపాలెం	పి.పార్థసారథి
కురువాడ	శ్రీగౌరీ
మాధవనగరం	టి.వి.ఎల్.రాజు
కె.వి.శరభవరం	పి.వెంకటేశ్వరమ్మ
సరుగుడు	కె.వరహాలబాబు
రామన్నపాలెం	ఓ.సత్యనారాయణ
కె.సిరిపురం	ఎన్.వి.వి.ఎన్.మూర్తి
సుందరకోట	సి.శైలజా
శనివారం ఎన్నికలు జరిగే గ్రామాలు	
కొండ ధర్మవరం	ఎన్.ప్రేమ్‌కుమార్
కృష్ణాపుర అగ్రహారం	ఈ.దేముడు

7న దేవానంద స్వామీజీ ఆరాధన మహోత్సవం

- కొత్తపెంట స్వామీజీ ఆశ్రమంలో భారీగా ఏర్పాట్లు



కొత్తపెంటలో సద్గురు దేవానంద సరస్వతీ స్వామీజీ విగ్రహం

దేవరాపల్లి : శ్రీ సద్గురు దేవానంద సరస్వతీ స్వామీజీ మహరాజ్ (రుషీకేష్) 25వ ఆరాధన మహోత్సవాలను కొత్తపెంటలోని స్వామీజీ ఆశ్రమంలో ఈ నెల 7న అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు(నీలిమ) తెలిపారు. దేవానంద స్వామీ ఆధ్యాత్మిక జీవన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు. స్వామీజీ 25 ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకొని భారీగా భక్తజనం హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నెల 5 నుండి పూజులు, భజన కార్యక్రమాలను ప్రారంభించి ఆఖరి రోజు 7న ముగిస్తాయన్నారు. ఈ ఆరాధన మహోత్సవానికి దేశ వ్యాప్తంగా స్వామీజీ భక్తులు, శిష్యులు, సాధు సత్పురుషులు అధిక సంఖ్యలో తరలివస్తారన్నారు. ఆరాధన మహోత్సవాలకు పలు ఆశ్రమాల పీఠాధిపతులు హాజరై ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తారన్నారు. ఆఖరి రోజు 7న స్వామీజికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, భగవద్గీత పారాయణం, మహాత్ముల ప్రవచనాలు, భారీ అన్నసమారాధన ఉంటాయన్నారు.

నంబరు ప్లేట్ మార్చి గంజాయి తరలింపు

- 110 కేజీల ప్యాకెట్లతో కారు పట్టివేత
- ఇద్దరు రాజస్థాన్ నిందితుల అరెస్టు



పట్టుబడిన గంజాయికారుతో పోలీసులు

ఎస్.రాయవరం: మండలంలో 110 కిలోల గంజాయి ప్యాకెట్లు పట్టుబడింది. దీని విలువ రూ.20 లక్షల వరకు ఉంటుందని నక్కపల్లి సీఐ రామకృష్ణ గురువారం తెలిపారు. సీఐ వివరాల ప్రకారం... అడ్డురోడ్డు సమీపంలో జాతీయ రహదారి ఆనుకున్న లేఅవుట్ వద్ద అనుమానాస్పదంగా ఆగిఉన్న కారును తనిఖీ చేయడంతో గంజాయి పట్టుబడింది. రాజస్థాన్‌కు చెందిన ఇరువురు కారు (ఏపీ40బీహెచ్3733)లో అడ్డురోడ్డు మీదుగా వేంపాడు టోల్ గేట్ దాటాల్సి ఉండగా, అక్కడ తనిఖీలు చూసి వెనక్కి వచ్చారు. అడ్డురోడ్డు సమీపంలో వెంకటేశ్వర లాడ్జి వద్ద లేఅవుట్‌లో కారు నిలిపారు. ఆగి ఉన్న కారును ఎస్.రాయవరం ఇన్‌చార్జిగా బాధ్యత తీసుకున్న, కోటవురట్ల ఎస్ఐ రమేష్ తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశారు. కారు నంబర్ ప్లేట్ కింద ఒరిజినల్ నంబర్ ఆర్‌జే30సీబీ 8575గా గుర్తించారు. అనంతరం కారు డిక్కీలో 22 ప్యాకెట్లలో 110 కేజీల గంజాయి లభించింది. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై తరచూ వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కారు పట్టుబడింది. ఇదేక్రమంలో ఇకపై తనిఖీలు యధావిధిగా ఉంటాయని సీఐ తెలిపారు. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు.

10లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈవో అప్పారావు నాయుడు



తాటిపర్తి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో డీఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మాడుగుల రూరల్ : ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా లక్ష్యం దిశగా చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు పేర్కొన్నారు. తాటిపర్తి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను ఆయన గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి విద్యా బోధన ఏ విధంగా నిర్వహిస్తున్నారో స్టడీ అవర్స్ ఏ విధంగా నిర్వహిస్తున్నారో విద్యార్థులను ఆరా తీసారు. ఆనంతరం ప్రధానోపాధ్యాయురాలు ఎస్.ఎస్.రమాదేవి, మేట్రన్ వి. మహేశ్వరి, ఉపాధ్యాయులతో సమావేశమై ఈ ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఈ పాఠశాల నుంచి శతశాతం ఉత్తీర్ణతా శాతం సాధించే దిశగా విద్యార్థినులను సన్నద్ధం చేయాలని సూచించారు. పాఠశాల పనివేళలను సక్రమంగా పాటిస్తూ ఇప్పటి వరకూ పూర్తి చేసిన సిలబస్‌ను విద్యార్థినులకు స్టడీ అవర్స్ నిర్వహించి చదివించాలని హెచ్‌ఎంను ఆదేశించారు. అలాగే పలు విషయాలుపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు కలిసి డీఈవో అప్పారావునాయుడిని సన్మానించారు.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



హేమచంద్రన్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పీడీ వై.పోలిరెడ్డి

యలమంచిలి రూరల్: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్.హేమచంద్రన్ కాంస్య పతకం సాధించాడు. గత నెల 23 నుంచి 26 వరకు నేపాల్ ఖాట్మాండ్ కవర్డ్ హాల్‌లో యెనెక్స్ సన్ రైజ్ నేపాల్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్ బీడబ్ల్యూఎఫ్ 2024 పోటీల్లో బాలుర డబుల్స్ విభాగంలో భారత్ తరపున పోటీల్లో పాల్గొన్న హేమచంద్రన్ సత్తా చాటాడు. కాంస్య పతకం సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పీడీ పోలిరెడ్డి గురువారం అభినందించారు. హేమచంద్రన్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న హేమచంద్రన్ విశాఖలో కోచ్ వద్ద శిక్షణ పొందినట్టు తెలిపారు.

కొత్తపట్నం సముద్ర తీరంలో తాబేళ్ల మృత్యువాత

- ఫార్మాకాలుష్యంపై చర్యలు తీసుకోవాలి
- ఆంధ్రప్రదేశ్ మత్స్యకార సంఘం నాయకుడు చోడిపిల్లి గంగరాజు



కాలుష్యం బారిన పడి సముద్రంలో చనిపోయిన తాబేళ్లను చూపుతున్న మత్స్యకార సంఘం నాయకులు

రాంబిల్లి (యలమంచిలి) : ఫార్మా పరిశ్రమల నుంచి సముద్రంలో వ్యర్థాల కాలుష్యం వల్ల పదుల సంఖ్యలో తాబేళ్లు మత్యువాత పడుతున్నాయని ఆంధ్రప్రదేశ్ మత్స్యకార సంఘం నాయకులు చోడిపల్లి గంగరాజు ఆరోపించారు. రాంబిల్లి మండలంలో కొత్తపట్నం గ్రామంలో గురువారం కాలుష్యం బారిన పడి మత్యువాత పడిన తాబేళ్లను స్థానిక మత్స్యకారులతో కలసి పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంబిల్లి, అచ్యుతాపురం మండలంలో ఉన్న ఫార్మా పరిశ్రమల నుంచి వదులుతున్న విషవాయువుల వల్ల సముద్రంలో తీరం అంతా కలుషితమై పెద్ద సంఖ్యలో తాబేళ్లు, చేపలు మృతి చెందుతున్నాయని, గతంలో ఎన్నడూ లేని విధంగా పరిశ్రమల నుంచి వస్తున్న రసాయన వ్యర్థ జలాలు సముద్రంలో విడిచిపెట్టడం వల్ల మత్స్యసంపద నశించిపోతుందని గంగరాజు ఆరోపించారు. జిల్లా కలెక్టర్, పర్యావరణశాఖ అధికారులు, స్పందించి సముద్రంలో జీవిస్తున్న జీవరాశులు చేపలు, రొయ్యలు, తాబేళ్లు, పీతలు మొదలగు వాటి మనుగడకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో చోడిపల్లి అప్పలరాజు, ఆంద్రయ్య, పెంటయ్య, అమ్మోరయ్య, కోదండరాం పాల్గొన్నారు.

అలల జోరు.. విన్యాసాల హోరు

- అబ్బురపరిచిన నౌకాదళ ప్రదర్శనలు
- 4న తుది విన్యాసాలకు ఏర్పాట్లు





కడలిపై కదన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా సాగరతీరంలో గురువారం జరిగిన నావికాదళ పూర్తిస్థాయి విన్యాసాలతో నగరవాసులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. దాదాపు గంటన్నర పాటు కనులార్పకుండా ప్రజలు వీటిని వీక్షించారు. భారత నావికాదళం తమ సాయుధ సంపత్తిని ప్రజలకు తెలిపే విధంగా ఈ విన్యాసాలు సాగాయి. 15 యుద్ధ విమానాలు, జలాంతర్గామి, పలు నౌకలు పాల్గొన్నాయి. తొలుత మూడు హెలికాప్టర్లు భారత జాతీయ పతాకాన్ని, నావికాదళ పతాకాన్ని గగనతలంలో ఎగురవేస్తూ.. ప్రయాణించడంతో కార్యక్రమం ప్రారంభమైంది. వెంటనే ఐదు హాక్ విమానాలు గగనతలంలో గర్జిస్తూ కనువిందు చేశాయి. మెరైన్ కమాండోలు హెలికాప్టర్ నుంచి ఎంతో చాకచక్యంగా సముద్రంలోకి దిగి, అక్కడి నుంచి జెమిని బోట్లలో తీరానికి చేరుకుని బందీలను విడిపించారు. తిరిగి సముద్రంలోకి వెళ్లిపోవడం ఎంతో ఆసక్తిని కలిగించాయి. ఆయిల్ రిగ్‌ను విజయవంతంగా పేల్చి సముద్రంలో జరిగే యుద్ధాలను కళ్లకు కట్టినట్లు చూపించారు. భారత్‌లో తయారైన ఎల్‌సీఎం హెలికాప్టర్ నుంచి పారాచూట్‌ల సహాయంతో మెరైన్ కమాండోలు ఎంతో చాకచక్యంగా కిందకు దిగిన విధానం ఆకట్టుకుంది. ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఐఎన్ఎస్ మైసూర్, ఐఎన్ఎస్ ఢిల్లీ నౌకలపై చేతక్ హెలికాప్టర్లు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు దిగిన తీరు అబ్బురపరిచింది. అనంతరం రెండు హాక్ విమానాలు రెండు వైపులా వాయువేగంతో దూసుకువెళ్లడం, ఏంజెల్స్‌గా పిలిచే చేతక్ హెలికాప్టర్లు ఎంతో సమన్వయంతో చేసిన విన్యాసాలు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్‌లో అత్యవసర, విపత్తు సమయాల్లో ప్రజలను రక్షించే విధానం చూపిన తీరు అదరహో అనిపించింది. అనంతరం సీ కేడెట్ కార్ప్స్ నృత్యం, నౌకల నుంచి నమూనా ఫైరింగ్, బాణం ఆకారంలో వెళ్లిన ఏఎల్‌హెచ్ విమానాలు, డార్నియర్ విమానాల శ్రేణి, పీహెచ్ఐ విమానం, జెట్ ఫైటర్‌ల విన్యాసాలు అందరిలో ఉత్సుకతను పెంచాయి. చివరిగా నావికాదళం బీటింగ్ రిట్రీట్ కార్యక్రమం జరిగింది. విద్యుత్‌కాంతులతో, నౌకలు మెరిసిపోయాయి. నావికాదళ సైనికులు చేసిన కవాతు ప్రజల మనసుల్లో నిలిచిపోయింది. ఈ విన్యాసాలను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి వీక్షించారు. నావికాదళ తుది దశ విన్యాసాలు ఈ నెల 4వ తేదీన జరగనున్నాయి.

– ఏయూక్యాంపస్

హైడ్రో పవర్ ప్లాంట్‌ను రద్దు చేయాలి

- విశాఖ పర్యటనలో మోదీ ప్రకటన చేయాలన్న సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం

దేవరాపల్లి: మండలంలోని చింతలపూడి, నగరంపాలెం ప్రాంతాలలో నిర్మాణం తలపెట్టిన అదానీ హైడ్రో పవర్ ప్లాంట్‌ను అడ్డుకుని తీరుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం హెచ్చరించారు. చింతలపూడి ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మించబోయే స్థలాన్ని గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్నతో కలిసి ఆయన పరిశీలించారు. స్థానిక గిరిజనులకు చేటు కలిగించే ఈ ప్రాజెక్టును నిర్మించవద్దని డిమాండ్ చేస్తూ భారీగా హాజరైన గిరిజనులతో కలిసి నిరసన చేపట్టారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ నగరంపాలెం గ్రామంలో అటవీ ప్రాంతం ఉందని జలజీవన్ మిషన్ పథకం పైపు లైన్ పనులను అడ్డగించిన ఫారెస్టు అధికారులు అదానీ ప్రాజెక్టుకు ఎందుకు అడ్డు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో రైవాడ, కోనాం ప్రాజెక్టులకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయకట్టు భూములన్నీ ఏడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ నెల 9న విశాఖలో పర్యటించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైడ్రో పవర్ ప్లాంట్ రద్దుకు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బి.టి. దొర, ఎం. ఎర్రునాయుడు, జె. ఈశ్వరరావు, దాయిరి శ్రీను, వెంకటేష్, జగన్నాథం, శ్రీను పాల్గొన్నారు.

3 వేల లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

నర్సీపట్నం: మండలంలోని ధర్మసాగరం గ్రామ శివారుల్లో సారా తయారీ స్థావరాలపై రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ ఆదేశాల మేరకు ఎస్సై రాజారావు, సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. మూడు వేల లీటర్ల బెల్లపు పులుపును ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి పాల్పడినా, అమ్మకాలు సాగించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

పల్నాడు దొంగ జంట మోసం

- పరిచయం పెంచుకుని దొంగతనాలు
- అచ్యుతాపురంలో రూ.2.80 లక్షల తస్కరణ
- గతంలో పిఠాపురం, చోడవరంలోనూ చోరీలు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సత్యనారాయణ



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

అచ్యుతాపురం: బంగారు వస్తువుని చూపించి నమ్మబలుకుతారు. ముఖ్యంగా వాణిజ్య దుకాణదారుల్ని లక్ష్యంగా చేసుకుని పరిచయాలు పెంచుకుంటారు. ముందుగా దుకాణం వద్దే బంగారం వస్తువు ఉంచడంతో నమ్మకంగా భావించిన దుకాణదారులు వారితో మాట్లాడే సమయంలో దొంగ జంటలో ఒకరు నగదు తస్కరిస్తారు. ఇలా మూడు ప్రాంతాల్లో దొంగతనాలు చేసిన పల్నాడు జిల్లాకు చెందిన జంటను అచ్యుతాపురం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసులు సేకరించిన సమాచారం, డీఎస్పీ సత్యనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం...

నమ్మించి మోసం చేస్తున్న దొంగ జంట...

పల్నాడు జిల్లాకు చెందిన యూ సత్యనారాయణ, కల్యాణి భార్యాభర్తలమని చెప్పి అచ్యుతాపురంలోని ఒక బట్టల దుకాణం నిర్వాహకులతో పరిచయం పెంచుకున్నారు. గత నెలలో ఒకసారి వచ్చి బంగారం బిస్కట్ లాంటి వస్తువుని ఇచ్చి అమ్మిపెట్టాలని, తమ కుటుంబంలో వారి వివాహానికి బట్టలు కొనుగోలు చేయాల్సి ఉందని చెప్పి వెళ్లిపోయారు. కొద్ది రోజుల తర్వాత (డిసెంబర్ 18న) దుకాణం వద్దకు వచ్చిన భార్య నిర్వాహకులను మాటల్లో పెట్టి బట్టలు చూస్తుండగా, భర్త దుకాణంలోని రూ.2.80 తస్కరించాడు. భార్య కూడా మరో రూ.80 వేలు చోరీ చేసింది. వారిద్దరూ అక్కడి నుంచి చల్లగా జారుకున్న తర్వాత మోసపోయామని గుర్తించిన యజమాని అచ్యుతాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ గణేష్, ఎస్ఐ సుధాకర్, సిబ్బంది మల్లేశ్వరరావు, బంగారయ్య గురువారం అచ్యుతాపురంలో అనుమానంగా సంచరిస్తున్న నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద సొమ్మును, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పల్నాడుకు చెందిన వీరిద్దరు భార్యాభర్తలు కాదని గుర్తించారు. గతంలో వీరు పిఠాపురం, చోడవరం ప్రాంతాల్లో చోరీ చేసి, అచ్యుతాపురంలోనూ తతంగం పూర్తి చేశారు. ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. ఇటువంటి గుర్తు తెలియని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవ్వరినీ నమ్మవద్దని డీఎస్పీ సత్యనారాయణ హెచ్చరించారు.

క్లుప్తంగా

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

అనకాపల్లి: అక్షయ సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4న స్థానిక గాంధీనగరం ప్రాంతీయ పశు వైద్య కార్యాలయంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సంఘం చైర్మన్ ఎస్.వి.కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. కన్నూరుపాలెం, తీడ, చెరకాం, సుందరయ్యపేట, ఆనందపురం, లాలంకొత్తూరు, జి. భీమవరం, సింగవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వారపు సంతలో పెరిగిన కూరగాయల ధరలు

కశింకోట: వారపు సంతలో కూరగాయల ధరలు గురువారం ఘాటెక్కాయి. ప్రధానంగా వంకాయ, బెండకాయ ధరలు బాగా పెరిగాయి. వంకాయ, బెండకాయ కిలో రూ.80కి విక్రయాలు సాగాయి. గత వారం వీటిని రూ.60కి విక్రయించారు. ఇక బంగాళాదుంప రూ.40 నుంచి రూ.30కి తగ్గింది. ఎప్పటిలాగే టమాటా రూ.20, ఉల్లిపాయ రూ.40, బీట్రూట్, క్యారెట్ రూ.80, చిక్కుడు రూ. వందకు విక్రయాలు సాగాయి.

పాల రైతులకు అమూల్ ప్రోత్సాహకాలు

చోడవరం రూరల్: అమూల్ డెయిరీ పాడి రైతులకు తగు ప్రోత్సాహకాలను అందిస్తోంది. బెన్నవోలు పాల సేకరణ కేంద్రానికి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతులకు బోనస్‌గా బిర్యానీ బేసిన్లు అందజేసింది. గ్రామ సర్పంచ్ మూడెడ్ల శంకరరావు వీటిని గురువారం పంపిణీ చేశారు. అమూల్ డెయిరీ ఇన్‌చార్జి సాయి కిరణ్ పాల్గొని తమ డెయిరీ రైతులకు లబ్ధి కలిగేలా పలు రకాల సేవలు అందిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. డెయిరీ సెంటర్ కార్యదర్శి కంఠంరెడ్డి రమాదేవి, వార్డు మెంబర్లు మొల్లి గోవింద, కంఠంరెడ్డి రామాంజనేయ, నిట్ట రమణబాబు, మజ్జి గోవింద్, మజ్జి రమణబాబు, పందూరు దేముళ్ల తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 4,970 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,940	5,130
మొదటి రకం	3,990	5,250
రెండో రకం	3,400	4,200
మూడోరకం	3,200	3,390

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	:	సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	:	సత్యనారాయణ స్క్రీన్-2
యూఐ	:	పర్లిసాయి
మ్యాక్స్	:	షిర్డీసాయి
క్రేవెన్ ది హంటర్	:	వెంకటేశ్వర
సై	:	శ్రీసత్య
మార్కో	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 20 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-7 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను (9703619706)సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 345 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

రహదారులకు మోక్షమెప్పుడు?



మామిడిపాలెం రహదారి

- శిథిలమైన అనకాపల్లి–చోడవరం రహదారి
- మామిడిపాలెం రహదారిదీ అదే దుస్థితి
- ఇబ్బంది పడుతున్న ప్రజలు.. వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో రహదారులు అభివృద్ధి చేస్తామని కూటమి నాయకులు ఇంటింటికీ వచ్చి హామీ ఇచ్చారు. అయితే అధికారం చేపట్టిన తర్వాత ఆ విషయమే మరిచిపోయారని ప్రజలు వాపోతున్నారు. దీనివల్ల ప్రయాణ సమయంలో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనకాపల్లి–చోడవరం రహదారిని అభివృద్ధి చేయాలి..

మండలంలో తుమ్మపాల పంచాయతీ నుంచి మామిడిపాలెం వెళ్లే చోడవరం రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పెద్దపెద్ద గోతులతో మృత్యు కుహరాల్లా దర్శనమిస్తోంది ఇది ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వాహన చోదకులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికే ఈ రహదారిలో వేలాది వాహనాలు మరమ్మతులకు గురయ్యాయి. చాలా మంది ద్విచక్ర వాహన చోదకులు క్షతగాత్రులయ్యారు.

క్వారీలు అధికం..

అనకాపల్లి మండలంలో క్వారీలు ఎక్కువగా ఉన్నాయి. మార్టూరు, బవులువాడ, దర్జీనగర్, మామిడిపాలెం, పావయ్యసంతపాలెం గ్రామాల్లో పెద్దపెద్ద క్వారీలు ఉన్నాయి. వాటి నుంచి రోజుకు సుమారు వెయ్యి లారీలు అనకాపల్లి నుంచి అచ్యుతాపురం, రాంబిల్లి, యలమంచిలి, పరవాడ, విశాఖ వెళ్లడంతో రహదారి శిథిలావస్థకు చేరుకుంది. మండలంలోని గ్రామాల నుంచి తుమ్మపాల పంచాయతీ పరిధిలో బొజ్జన్న కొండ మీదుగా జిల్లాలో ఇతర ప్రాంతాలకు క్వారీ లారీలు పగలు ప్రయాణించగా, రాత్రి సమయంలో అనకాపల్లి పట్టణం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి.

ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి..

అనకాపల్లి నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాలో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి ఇదే. అనకాపల్లి, చోడవరం, దేవరాపల్లి, మాడుగుల మండలాల ప్రజలు ఈ రహదారి మీదుగానే పాడేరు, అరకు, జోలాపుట్, ముంచింగ్‌పుట్, జి.మాడుగుల, ఒడిశా రాష్ట్రాలకు వెళ్తుంటారు.



బవులువాడ రహదారి

వర్షాలు పడితే తిప్పలు తప్పవు..

ఈ మార్గంలో వర్షాలు పడినట్లయితే మండలంలో తుమ్మపాల నుంచి మామిడిపాలెం రహదారిలో పెద్దపెద్ద గోతులు ఉండడంతో గోతుల్లో వర్షపు నీరు చేరి రహదారి పూర్తిగా చెరువును తలపిస్తుంది. అయినప్పటికీ చెరువులో నుంచి ప్రయాణం సాగించాలి తప్ప మరో మార్గం ద్వారా అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లేందుకు లేకుండా పోయింది.

రహదారిని అభివృద్ధి చేయాలి..



కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధిలో పూర్తిగా విఫలమైంది. శిథిల రహదారుల వల్ల పలు సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలు, వాహన చోదకుల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని అనకాపల్లి-చోడవరం రహదారిని తక్షణమే అభివృద్ధి చేయాలి.

– రాపేటి వెంకటేశ్వరరావు, తుమ్మపాల గ్రామం, అనకాపల్లి

క్వారీ లారీలతోనే అసలు సమస్య..



మండలంలో క్వారీ లారీలు అధిక లోడుతో ప్రయాణం చేస్తున్నాయి. అనకాపల్లి-చోడవరం రహదారి అభివృద్ధి చేసే ముందు రహదారికి ఇరువైపుల డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తే బాగుంటుంది. వర్షాలు పడక ముందే అధికారులు చర్యలు తీసుకుని రహదారిని బాగు చేయాలి.

-కె.ఎం.నాయుడు, అనకాపల్లి

శిథిలమవుతున్న బొజ్జన్నకొండ రహదారి..

క్వారీ లారీలు ఎక్కువగా బొజ్జన్న కొండ రహదారి మీదుగా అధిక లోడ్లతో ప్రయాణించడం వల్ల ఈ రహదారి శిథిలమవుతోంది. దీంతో ప్రజలు, బొజ్జన్నకొండకు వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు..

మండలంలో బవులువాడ, దర్జీనగర్, తుమ్మపాల, మార్టూరు గ్రామాల ప్రజలు శిథిలమైన రహదారుల నుండి వచ్చే క్రషర్ బుగ్గితో వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన స్థానిక యువత గోతులను పూడ్చారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి

తుమ్మపాల: ప్రభుత్వ కార్యాలయాలు అన్నింటికీ సొంత భవనాల నిర్మాణం చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. పట్టణం మున్సిపాలిటీ స్థాయి నుండి గ్రేటర్ విశాఖలో అంతర్భాగంగా మారి ప్రస్తుతం జిల్లాగా ఏర్పడినప్పటికీ అధిక శాతం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేటు భవనాలలో కొనసాగడం అత్యంత దారుణమన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు అన్నింటికీ సొంత భవనాల నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు గురువారం వినతిపత్రం అందించారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలను నిరుపయోగంగా వదిలేసి లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని అద్దెల రూపంలో చెల్లిస్తూ అరకొర వసతుల మధ్య ప్రైవేటు భవనాలలో కొనసాగించడం ప్రజలకు మరింత భారమన్నారు. కూటమి ప్రభుత్వంలో పాలకులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణం చేపట్టాలని, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న మాణిక్యాలరావు

జోరుగా గాలిపటాల విక్రయం

కశింకోట: స్థానికంగా రంగు రంగుల గాలి పటాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. సంక్రాంతి వస్తుందంటే వీటిని ఎగుర వేయడానికి యువకులు ఆసక్తి చూపుతారు. ప్రస్తుతం సంక్రాంతి ముందు, తర్వాత సెలవు రోజుల్లో పిల్లలు ఉత్సాహంగా గాలి పటాలు ఎగుర వేసి ఆనందంగా గడుపుతారు. శారదా తీరం, చెరువు గట్లు, విశాలమైన వీధులు, ఇళ్లపైన గాలిపటాలను ఎగుర వేసి ఆనందిస్తుంటారు. గరుడ పక్షి, సీతాకోక చిలుక రూపాల్లో ఆకర్షణీయంగా తయారు చేసిన గాలిపటాలను విక్రయిస్తున్నారు. అయితే ఇవి అందంగా ఉన్నప్పటికీ ధరలు మాత్రం అందనంత ఎత్తులో ఉన్నాయి. పరిమాణాన్ని అనుసరించి కనీసం రూ.60 నుంచి రూ.460 వరకు విక్రయిస్తున్నామని దుకాణదారులు చెబుతున్నారు.



విక్రయిస్తున్న రంగుల గాలి పటాలు

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

తుమ్మపాల: ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని, తద్వారా మరొకరి ప్రాణాలు కాపాడటంతో పాటు ఆరోగ్యంగా జీవించవచ్చని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని కొత్తూరు శారదానగర్‌లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బీశెట్టి జగస్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని చేపట్టిన మెగా రక్తదాన శిబిరాన్ని గురువారం ఆయనతో పాటు మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అదీప్‌రాజ్, దంతులూరి దిలీప్‌కుమార్ కేక్ కటింగ్ చేసి జగస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల నాటికి పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. మొత్తం 72 మంది రక్తదానం చేసినట్లు ఏఎస్ రాజా, అభయాంజనేయ బ్లడ్ బ్యాంక్‌ల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

వేరుశనగలో విత్తన శుద్ధి తప్పనిసరి

- కేవీకే ప్రధాన శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, సౌజన్య

దేవరాపల్లి: వేరుశనగ సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు కె. రాజ్‌కుమార్, సౌజన్య సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా గురువారం కాశీపురంలో ఏవో వై. కాంతమ్మ ఆధ్వర్యంలో నూనె గింజలలో సామూహిక ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. వేరుశనగ గింజలను మాంకోజబ్, కార్బన్‌డజిం మందుతో విత్తన శుద్ధి చేయాలని ప్రయోగాత్మకంగా వివరించారు. విత్తన శుద్ధి చేయడం ద్వారా పంటకు చీడపీడల బెడద నుంచి రక్షించుకోవచ్చునన్నారు. దిగుబడి సైతం ఆశాజనకంగా ఉంటుందని రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. వేరుశనగ పంట వేసిన 40 రోజుల తర్వాత ఏపుగా ఎదిగేందుకు దోహదపడే సూక్ష్మపోషకాలు కల్గిన మల్టీ కె మందులను రైతులకు ఉచితంగా అందజేశారు. సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, తమటపు శెంబునాయుడు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



కాశీపురంలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, సౌజన్య, ఏవో కాంతమ్మ

ప్రతి రైతుకూ కనీస మద్దతు ధర

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

నర్సీపట్నం: ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి రైతు కనీస మద్దతు ధర పొందేలా చూడాల్సిన బాధ్యత రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జులపై ఉందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం ఏడీ కార్యాలయంలో రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జులతో ఆయన సమీక్షించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో ధాన్యం అమ్ముకునే రైతుల వివరాలను నమోదు చేయాలన్నారు. రబీ ఈ– పంట నమోదు వేగవంతం చేయాలన్నారు. కౌలు రైతుల వివరాలను బ్యాంకులతో సంప్రదించి అర్హత ఉన్న వారికి పంట రుణాలు అందించాలని ఆదేశించారు. ఏడీ టి.శ్రీదేవి, నర్సీపట్నం, గొలుగొండ, రోలుగుంట వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

పెరుగుతున్న చలి



గాంధీనగరం మెయిన్‌రోడ్డులో మంచులో ప్రయాణిస్తున్న వాహనాలు

అనకాపల్లి: పట్టణ పరిధిలో రోజురోజుకు చలి ఎక్కువ అవుతోంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 7 గంటలకు పట్టణ పరిధిలో మంచు కురవడంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని నెమ్మదిగా వెళ్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పంట పొలాలకు వెళ్లాలంటే ఉదయం 8 గంటల తర్వాతే వెళ్తున్నారు. గురువారం పట్టణ పరిధిలో గరిష్ఠంగా 28.5, కనిష్ఠంగా 17.0 ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

హత్యాయత్నం కేసు నమోదు

అనకాపల్లి: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో జీవీఎంసీ విలీన గ్రామానికి చెందిన ముత్యాల శేఖర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ రవికుమార్ గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు వివరాలు ఇలా ఉన్నాయి. సిరసపల్లిలోని వైన్‌షాప్ వద్ద జరిగిన ఘర్షణలో శేఖర్ సంతోష్‌ను పక్కనే ఉన్న రేకుతో తలపై కొట్టడంతో తీవ్ర గాయమైందని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు క్షతగాత్రుడు సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

అనకాపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విజయవాడ, నరసాపురం ప్రాంతానికి చెందిన గాడికి దారు (58) ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకట నారాయణ తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం మెయిన్ రోడ్డులోని చేపల బజార్ జంక్షన్‌లో రోడ్డు దాటుతున్న గాడికి దారుని పెరుగుబజార్ జంక్షన్ నుంచి రింగ్‌రోడ్డుకు వెళ్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో గాయపడిన క్షతగాత్రుడిని హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడు ఏడాది కాలంగా అనకాపల్లి పట్టణంలో నివసిస్తున్నట్లు సీఐ తెలిపారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

మాడుగుల రూరల్/కె.కోటపాడు: గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కె.జె.పురం, వారాడ సర్పంచులు జామి రమణబాబు, గొర్రుపోటు సౌజన్య తెలిపారు. కె.జె.పురం, వారాడ సచివాలయాల వద్ద గురువారం ఉదయం గ్రామ సభలు నిర్వహించారు. శాఖలు వారీగా సిబ్బందితో సమీక్షించారు. కె.జె.పురం ప్రగతి నివేదికను పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ప్రవీణ్ చదివి వినిపించారు. ఎంపీటీసీ సభ్యులు బీశెట్టి శ్రీనివాసరావు, చిన్నం లోవ తల్లి పాల్గొన్నారు. వారాడ పంచాయతీ కార్యదర్శి సరోజిని మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్నులను మార్చి 31లోగా చెల్లించాలన్నారు. వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, ఉప సర్పంచ్ చిరికి గోవింద, గొర్రుపోటు వెంకటరావు, లెక్కల గోపి పాల్గొన్నారు.

మోదమాంబకు వెండి బహూకరణ

మాడుగుల రూరల్: ఎం. కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మకు గ్రామానికి చెందిన మర్లోతు సత్తిబాబు, దుర్గ దంపతులు పావు కిలో వెండి బహూకరించారు. దీన్ని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు గురువారం అందజేశారు. ఆలయాభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి వస్తు, ధన రూపంలో విరాళాలు ఇవ్వాలని సర్పంచ్ కోరారు. నాయకులు గంగిరెడ్ల లింగన్న, పడాల అప్పలనాయుడు, కలిమి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

అనకాపల్లి: ట్రాన్స్‌పోర్టు డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఈనెల 5న జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు తెలిపారు. జాతీయ రహదారి పూడిమడక జంక్షన్ వద్ద సంక్షేమ బోర్డు కరపత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత చట్టం వల్ల రానున్న రోజుల్లో డ్రైవర్ల వృత్తి ప్రమాదంలో పడుతుందన్నారు. అనివార్య కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ఎవరైనా మరణిస్తే డ్రైవర్లను పూర్తి బాధ్యులను చేసి శిక్ష పడేలా చట్టాలుంటాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారులు అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వాలు వాహన డ్రైవర్లపై చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. ఆర్టీవో కార్యాలయంలో జరగాల్సిన లైసెన్స్‌లు, వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం అన్యాయమన్నారు. దీనిపై ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు పలకా సత్యనారాయణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



పూడిమడక జంక్షన్ వద్ద కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

అనకాపల్లి: అన్నం పెట్టే రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, గత ఏడాది నవంబర్, డిసెంబర్ మాసాల్లో తుపాన్ల కారణంగా చేతికొచ్చిన వరి పంటకు తీవ్ర నష్టం జరిగిందని ప్రజా రాజకీయ వేదిక, రైతు స్వరాజ్య వేదిక, ఏపీ రైతు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆర్డీవో షేక్ ఆయూషాకు గురువారం సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి పెట్టుబడి పెట్టారని, నాయకులు సార్వత్రిక ఎన్నికల సమయంలో రైతుల పెట్టుబడికి కొంత నగదు అందజేస్తామని చెప్పి నేటికీ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రైతులను ప్రభుత్వాలు ఆదుకోనట్లయితే రానున్న రోజుల్లో రైతులు లేకుండా పోతారన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు కనిశెట్టి సురేష్ బాబు, గాడి బాలు, కోరిబిల్లి శంకరరావు, కోన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో షేక్ ఆయూషాకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి పర్యవేక్షణకు కృషి చేయాలని విశ్రాంత అసిస్టెంట్ డ్రగ్స్ కమిషనర్ కాండ్రేగుల సూర్య సత్యనారాయణ, విశ్రాంత ఎస్ఎల్‌జీటీ కర్రి సన్యాసినాయుడు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు ఆవరణలో లక్ష్మీ గణపతి ఆలయ సమీపంలో గురువారం రాత్రి గ్రీన్‌క్లబ్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో 14 రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. భావితరాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని, పరిశుభ్రమైన గాలి పీల్చాలంటే మొక్కల ద్వారానే సాధ్యమన్నారు. అనంతరం క్లబ్ సభ్యులకు జ్యూట్ సంచులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, సీనియర్ సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, పెంటకోట ఉమామహేశ్వరరావు, వై.సూరి అప్పారావు, బీరా వినోద్‌కుమార్, బేతాళం శేషసాయి తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్‌క్లబ్ సభ్యులకు జ్యూట్ బ్యాంగ్‌లు పంపిణీ చేస్తున్న సన్యాసినాయుడు

రూ.2.10 కోట్లతో తాండవ ప్రాజెక్టు అభివృద్ధి పనులు

- ఇరిగేషన్ ఈఈ బాల సూర్యం

నాతవరం: తాండవ రిజర్వాయరు అభివృద్ధి పనులకు రూ.2.10 కోట్లు మంజూరైనట్లుగా ఇరిగేషన్ ఈఈ వి.బాల సూర్యం తెలిపారు. డీఈ అనురాధ, ప్రాజెక్టు నూతన కమిటీ సభ్యులతో కలిసి ఆయన తాండవ ప్రాజెక్టును సందర్శించారు. ఇక్కడ నీటి నిల్వలతో పాటు మరమ్మతులకు గురైన గేట్లును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రాజెక్టు గేట్లు, పంట కాలువల అభివృద్ధి కోసం ప్రభుత్వం 18 పనులకు గాను నిధులు మంజూరు చేసిందన్నారు. ఐదు పనులను టెండర్ల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మిగతా పనులకు టెండర్ల ప్రక్రియ దశలో ఉందన్నారు. త్వరలోనే అన్ని పనులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె. సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నాగబాబు పాల్గొన్నారు.



తాండవ ప్రాజెక్టు అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఇరిగేషన్ ఈఈ బాల సూర్యం

దుర్గమ్మ హుండీ లెక్కింపు

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని కనకదుర్గ మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు చేపట్టారు. లెక్కింపులో ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు. హుండీ లెక్కించగా 75 రోజులకు రూ.5,38,145 ఆదాయం వచ్చిందని ఈవో టి.సాంబశివరావు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఆర్.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.